సీసీ రోడ్డు పనులు ప్రారంభం


సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీని అభివృద్ధిలో ఇతర మున్సిపాలిటీలకు ఆదర్శంగా తీర్చిదిద్దడం జరుగుతుందని మున్సిపల్ చైర్మన్ కౌకుట్లచంద్రారెడ్డి అన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని 19, 20 వార్డుల పరిధిలోని హోల్డ్ విలేజ్‌లో సుమారు 15 లక్షల మున్సిపల్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బండారి మల్లేష్ యాదవ్, కౌన్సిలర్లు శ్రీనివాస్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ



కీసర: నాగారం మున్సిపల్ పరిధిలోని మల్లన్న ఆలయం వద్ద సోమవారం నిర్వహించిన అయ్యప్ప స్వామి పడిపూజలో మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రిలే నిరాహార దీక్షలు


దీక్షలకు సంఘీభావం తెలుపుతున్న మాజీ ఎంపీపీలు శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

ఘట్‌కేసర్: రైల్వే వంతెన పనుల కోసం ఏజేసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారంతో 16 రోజులకు చేరుకుంది. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీలు శ్రీనివాస్‌గౌడ్, సుదర్శన్‌రెడ్డి, జేఏసీ చైర్మన్ లక్ష్మారెడ్డి, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ రాంరెడ్డి, డైరెక్టర్ లక్ష్మారెడ్డి, మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, కౌన్సిలర్లు ఆంజనేయులుగౌడ్, నర్సింగ్‌రావు సంఘీభావం తెలిపారు. కౌన్సిలర్ వెంకట్‌రెడ్డి, జంగయ్య దీక్షలు చేపట్టగా వీరేశం, కృపానిధి, సింగరేణి కాలనీ వాసులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచుల ముందస్తు అరెస్ట్



పోచారం: అసెంబ్లీ సమావేశాలను మాజీ సర్పంచులు అడ్డుకునే అవకాశాలున్నాయన్న సమాచారం మేరకు పోలీసులు ముందస్తు అరెస్టులు చేపట్టారు. ఇందులో భాగంగా కర్రెముల్ మాజీ సర్పంచ్ వెంకటేష్‌గౌడ్, వెంకటాపూర్ మాజీ సర్పంచ్ భర్త శ్రీనివాస్ ముదిరాజ్‌ను సోమవారం ఉదయమే ముందస్తుగా అరెస్ట్ చేసి పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్‌కు తరలించగా, కాచవానిసింగారం మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, ప్రతాపసింగారం మాజీ సర్పంచ్ శివకుమార్‌లను మేడిపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

దొంగకు దేహశుద్ధి.. పోలీసులకు అప్పగింత

ఘట్‌కేసర్: చోరీకి వచ్చిన దొంగను పట్టుకొని దేహశుద్ధి చేసిన ఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్ఎఫ్‌సీనగర్ బి–1 కాలనీలో ఓ ఇంటి తాళం పగులగొట్టి ఇంటిలోకి చొరబడిన కల్వకుర్తికి చెందిన పాత నేరస్తుడు నరేష్ (35)ను స్థానికులు గమనించి పట్టుకున్నారు. ఈ నేపథ్యంలో దొంగ వారి నుంచి తప్పించుకునేందుకు యత్నించగా పట్టుకొని కాళ్లు, చేతులు కట్టేసి చెట్టుకు కట్టేసి దేహశుద్ధి చేసి అనంతరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. నిందితుడు పాత నేరస్తుడని, మహబూబ్‌నగర్ జిల్లాలో అతని మీద 4 చోరీలు కేసులు ఉన్నాయన్నారు. ఇటీవల ద్విచక్రవాహనం చోరీ చేసి తప్పించుకు తిరుగుతున్నాడని పోలీసులు తెలిపారు. నిందితుడి పై మహబూబ్‌నగర్‌లో చోరీ కేసులు ఉండడంతో అతడిని అక్కడి పోలీసులకు అప్పగించామన్నారు.

స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి

అల్వాల్: ప్రజా సమస్యల పరిష్కారానికి మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని సాయిసూర్యకాలనీ, లక్ష్మీనగర్ ఫేజ్–2 వద్ద సోమవారం కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్ పాదయాత్ర చేశారు. సాయిసూర్యకాలనీ, లక్ష్మీనగర్ రెండు కొత్త కాలనీలు పూర్తి ఆక్యుపెన్సీతో డివిజన్ పరిధిలోకి రాబోతున్నందున కాలనీలో రోడ్లు, డ్రైనేజీలైన్లకు సంబంధించి తనిఖీలు చేశారు. డీఈ మహేష్, కాలనీవాసులు సురేందర్‌రెడ్డి, నర్సింగ్‌రావు, ఫణీంద్ర, విజయ్‌భాస్కర్, కాంగ్రెస్ నేతలు సురేందర్‌రెడ్డి, నవీన్, మధన్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

మల్కాజిగిరి: ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ పీవీఎన్‌కాలనీలో సీసీరోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ అధికారులకు సూచించారు. సోమవారం పీవీఎన్‌కాలనీలో రూ.15 లక్షలతో చేపడుతున్న సీసీరోడ్డు పనులను ఆయన పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. యూజీడీ పనులు పూర్తయిన కాలనీల్లో సీసీరోడ్ల నిర్మాణం చేపడుతున్నామని, నాణ్యతపై అనుమానం ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. బాబు, సంపత్‌రావు, కిషోర్ పాల్గొన్నారు.

కార్పొరేటర్ పర్యటన

అల్వాల్: అల్వాల్ డివిజన్ పరిధిలో ఆదర్శ్‌నగర్‌లో కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి, జీహెచ్ఎంసీ, రైల్వే అధికారులతో కలిసి పర్యటించారు. మహాబోధి విద్యాలయం నుంచి ఆదర్శ్‌నగర్ వద్ద ఆర్‌యూబీ వరకు డ్రైన్‌కు ఇప్పటికే ఆర్‌సీసీ పైపుస్మార్ట్ వాటర్ డ్రైన్ పునర్నిర్మించడానికి ప్రతిపాదనను సమీక్షించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అల్వాల్ సర్కిల్ డిప్యూటీ ఈఈ, రైల్వే సిబ్బంది పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయించండి

మల్లాపూర్: నాచారం డివిజన్‌లో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం ఈస్ట్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్‌పాటిల్‌కు నాచారం కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్ వినతిపత్రం అందజేశారు. అంబేడ్కర్‌నగర్ నుంచి కార్తికేయనగర్ మధ్యలో బ్రిడ్జికి నిధులు, రాంరెడ్డినగర్‌లో వరద నీటి సమస్య పరిష్కారానికి ఈఎస్ఐ నుంచి నాలా పైపులైన్ వేయాలని కోరారు. దీనికి కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు కార్పొరేటర్ వివరించారు.

నిలిచిన రోడ్డు విస్తరణ పనులు..

ఇంకెన్నాళ్లు!

- రోడ్ల విస్తరణ ఉందా లేదా?
- నగం విస్తరణ రోడ్లతో తీవ్రఇబ్బందులు
- రోడ్డు పనులు పూర్తి చేయాలంటున్న స్థానికులు


వెడల్పుకు నోచుకొని మెయిన్ రోడ్డు

మేడ్చల్: మేడ్చల్ పట్టణంలో ప్రధాన రోడ్లు ఏళ్ల తరబడి విస్తరణ లేకుండా సగం విస్తరణలతోనే ఆగిపోవడంతో ప్రజలకు తిప్పలు మాత్రం తప్పడం లేదు. మేడ్చల్ పట్టణంలోని చాలా కాలనీలకు వెళ్లే కోర్టు రోడ్డు, అంబేడ్కర్ విగ్రహం నుంచి రైల్వేస్టేషన్ వరకు వెళ్లే రోడ్డు మార్కెట్ చౌరస్తా వరకు వెడల్పు లేకపోవడంతో ఏళ్ల తరబడి ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. సగం విస్తరణ అయిన రోడ్లు అభివృద్ధికి ఆటంకంగా మారాయి. మేడ్చల్ ప్రభుత్వ ఐటీఐ వద్ద జాతీయ రహదారి నుంచి బాలాజీ నగర్ వరకు ట్రాఫిక్ సమస్య విపరీతంగా మారిందని, ఇరుకు రోడ్డును వెడల్పు చేస్తామని రెండేళ్ల క్రితం చేపట్టిన పనులు సగంలోనే నిలిచిపోయాయి. జాతీయరహదారి నుంచి కోర్టు, బాలాజీ నగర్, కేఎల్‌ఆర్ నగర్, రాఘవేంద్రనగర్ మీదుగా అత్వెల్లి శాంతాబయోటెక్ వరకు మున్సిపల్ రోడ్డు సింగిల్ రోడ్డుగా ఉంది. కాలనీలు పెరగడంతో రాకపోకలు పెరిగి వాహనాల రద్దీ ఎక్కువగా ఉంది. శాంతాబయోటెక్ కంపెనీకి వెళ్లే బస్సులు, ఇతర వాహనాల సంఖ్య పెరగడంతో రోడ్డు వెడల్పు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో జాతీయ రహదారి పక్కనే ఐటీఐ ఉండటంతో అధికారులు రెండేళ్ల క్రితం సెప్టెంబర్ నెలలో ఐటీఐ ప్రహరీని కూల్చి దాదాపు అరెకరం స్థలం తీసుకుని తిరిగి ప్రహరీని నిర్మించారు. దీంతో కోర్టు చివరి వరకు రోడ్డు రూ.38 లక్షలతో వెడల్పుగా మారింది. రోడ్డు వెడల్పు పనులను నాటి మంత్రులు మల్లారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి ప్రారంభించారు.

పార్కింగ్‌లకు అడ్డాగా..

కోర్టుకు వచ్చే వాహనాలకు వెడల్పు చేసిన రోడ్డు పార్కింగ్ అడ్డాగా మారింది. కోర్టు వరకు ట్రాఫిక్ సమస్య తీరినా.. మిగతా రోడ్డు ఇరుకుగా ఉండటంతో సమస్యలు తప్పడం లేదు. చిరు వ్యాపారులు, ఇతర వ్యాపారులు రోడ్డు స్థలంలో తమ వ్యాపారాలు ఏర్పాటు చేసుకుని రోడ్డును కేంద్రంగా మార్చుకున్నారు.

మెయిన్ రోడ్డు అంతేనా..

జాతీయ రహదారి పై ఉన్న అంబేడ్కర్ విగ్రహం నుంచి రైల్వేస్టేషన్ వరకు ఉన్న రోడ్డు మెయిన్ రోడ్డు. ఈ రోడ్డు ఇరుకుగా మారడంతో ఇతర రోడ్లు అభివృద్ధి చెందాయి. 20 ఏళ్ల క్రితం మేడ్చల్ గ్రామ పంచాయతీ ఉన్న సమయంలో నాటి సర్పంచ్ రాజేశ్వర్‌గౌడ్ హయాంలో రోడ్డు విస్తరణ చేశారు. రైల్వేస్టేషన్ నుంచి మార్కెట్ చౌరస్తా వరకు వెడల్పు చేయగా జాతీయ రహదారి వైపు వెడల్పు చేస్తుండగా అప్రశ్రుతి దొర్లి వ్యక్తికి గాయాలు కావడంతో రోడ్డు వెడల్పు అర్ధాంతరంగా నిలిచిపోయింది. రాజకీయ నాయకులు ప్రవేశం చేసి రోడ్డు రాజకీయం చేయడంతో వెడల్పు పనులు ఏళ్లుగా మిగిలిపోయాయి. రోడ్డులో భవనాలు ఉన్న వారు తమకు అందజేసే నష్టపరిహారం విషయంలో కోర్టుకు వెళ్లడంతో విషయం పెండింగ్‌లో పడింది. ప్రస్తుత పాలకులు మేడ్చల్ రోడ్లు విస్తరణ చేపట్టడంతో పెండింగ్‌లో ఉన్న అన్ని రోడ్లను వెడల్పు చేసి సమస్యలను తీర్చాలని మేడ్చల్ వాసులు కోరుతున్నారు.


మార్కెట్ చౌరస్తా నుంచి రైల్వేస్టేషన్ వరకు గతంలో వెడల్పయిన మేడ్చల్ మెయిన్ రోడ్డు

స్లమ్‌లు, బస్తీల్లో అంగన్వాడీ కేంద్రాలు

- సర్కారుకు ప్రతిపాదనలు చేసిన జిల్లా సంక్షేమ శాఖ
- ప్రాంతాల వారీగా 60 అంగన్వాడీ,30 బేబీ కేర్ కేంద్రాల జాబితా అందజేత
- ఆదేశాల కోసం సంక్షేమశాఖ ఎదురు చూపులు

సాక్షి,సిటీబ్యూరో: నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిధిలోని స్లమ్‌లు, బస్తీల్లో అంగన్వాడీ కేంద్రాలు, బేబీ కేర్ సెంటర్లను ఏర్పాటు చేసేందుకు జిల్లా సంక్షేమశాఖ కసరత్తు చేస్తోంది. ఎక్కడెక్కడ కొత్త అంగన్‌వాడీ కేంద్రాలు, బేబీ కేర్ సెంటర్లను ఏర్పాటు చేస్తే ప్రయోజనవంతంగా ఉంటుందన్న విషయంలోనూ పారదర్శకంగా అధికార యంత్రాంగం సర్వే కూడా నిర్వహించింది. అలాగే, కలెక్టర్ అనుమతితో జిల్లాలో ఏర్పాటు చేయనున్న కొత్త 60 అంగన్వాడీ కేంద్రాలతోసహా 30 బేబీ కేర్ సెంటర్ల జాబితా తదితర వివరాలతో ప్రభుత్వానికి జిల్లా సంక్షేమశాఖ ప్రతిపాదనలు చేసింది. వీటికి సర్కారు నుంచి గ్రీన్ సిగ్నల్ లభించగానే.. ప్రారంభించేందుకు వీలుగా చర్యలు కూడా తీసుకుంటోంది. వీటిని స్లమ్(మురికివాడలు) ఏరియాలతోపాటు వెనుకబడిన ప్రాంతాలు, బస్తీలు, గ్రామాలు, వాడల్లో ఏర్పాటు చేసేందుకు జిల్లా సంక్షేమశాఖ కసరత్తు చేస్తోంది. ఇందుకోసం అంగన్‌వాడీ ప్రాజెక్టుల వారీగా కొత్త అంగన్‌వాడీ కేంద్రాలు, బేబీ కేర్ సెంటర్ల ఏర్పాటుపై సర్వే కార్యక్రమాన్ని పూర్తి చేశారు. అలాగే, సంబంధిత లబ్ధిదారులైన గర్భిణీలు, పాలిచ్చే తల్లులతోసహా ఏడు నెలల నుంచి మూడు సంవత్సరాల పిల్లలు, 3 సంవత్సరాల నుంచి 6 సంవత్సరాల పిల్లలను గుర్తించారు.

బేబీ కేర్ సెంటర్లకు..

నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేయనున్న బేబీ కేర్ సెంటర్లను అనువైన అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలకొల్పేందుకు జిల్లా సంక్షేమశాఖ చర్యలు తీసుకుంటోంది. జిల్లాలో సొంతభవనంలో విశాలమైన గదులను కలిగి ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో బేబీ కేర్ సెంటర్లను ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. అప్పుడే చిన్న పిల్లల సంరక్షణ(కేర్) బాగుంటుందని సంబంధిత సంక్షేమ అధికారులు యోచిస్తున్నారు. నిరుపేద, మధ్యతరగతి కుటుంబాల్లో చిన్న పిల్లలను కలిగి ఉన్న భార్యభర్తలు కార్మికులుగా లేదా పరిశ్రమలతోపాటు ఇతరతర ఉద్యోగాలు చేసినప్పుడు వారి సంరక్షణ కోసం బేబీ కేర్ సెంటర్లు ఎంతగానో ఉపయోగపడగలవని పేర్కొంటున్నారు. ఈ బేబీ కేర్ సెంటర్లలో పేద కుటుంబాల పిల్లల సంరక్షణ ఉచితంగా ఉంటుందని జిల్లా సంక్షేమశాఖ పేర్కొంటోంది.

793 అంగన్‌వాడీ కేంద్రాల్లో.. 1.07 లక్షలు

నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ప్రస్తుతం 793 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, ఇందులో మొత్తంగా 1,07,484 మంది లబ్ధిదారులు ఉన్నారు. ఈ లబ్ధిదారుల్లో 0–6 ఏళ్ల చిన్న పిల్లలు 90,361 మంది ఉండగా, గర్భిణీలు, బాలింతలు 17,123 మంది ఉన్నారు.

కూలిన ప్రహరీని తిరిగి నిర్మించాలని కలెక్టర్‌కు వినతి

ఘట్‌కేసర్: ఇటీవల వర్షానికి కూలిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీని తిరిగి నిర్మించాలని స్థానికుడు ఆంజనేయులు కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో వినతి పత్రం అందజేశాడు. ప్రహరీ కూలడంతో పశువులు, మేకలు పాఠశాల ఆవరణలోకి వచ్చి మొక్కలను తింటున్నాయని, దీంతో విద్యార్థుల చదువుకు ఆటంకం కలుగుతుందని లేఖలో తెలిపారు. రాత్రి సమయంలో మందు బాబులకు అడ్డాగా మారిందన్నారు. ఇప్పటికైనా విద్యార్థుల ఇబ్బందులపై దృష్టిసారించి కూలిన ప్రహరీ స్థానంలో తిరిగి గోడను నిర్మించాలని కోరాడు.

అక్రమ తవ్వకాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

పోచారం: యంనంపేట్‌లోని సర్వే నెంబర్ 90లో జరుగుతున్న మట్టి తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో కాంగ్రెస్ పార్టీ పోచారం మున్సిపాలిటీ అధ్యక్షుడు సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. అలాగే ఘట్‌కేసర్ మండల తహశీల్దారుతో పాటు పోచారం మున్సిపల్ కమిషనర్‌కు కూడా ఫిర్యాదు చేసినట్లు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. అక్రమ తవ్వకాలపై అధికారులు తక్షణమే స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఉచిత వైద్య శిబిరం



బోడుప్పల్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతమైన జీవితం గడిపేందుకు కృషి చేయాలని విద్యాజ్యోతి ఉన్నత పాఠశాల డైరెక్టర్ శ్రవణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. చెంగిచర్లలోని విద్యాజ్యోతి ఉన్నత పాఠశాలలో సోమవారం యశోద హాస్పిటల్స్, హిందూస్తాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సంయుక్తాధ్వర్యంలో నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు బీపీ, షుగర్, కంటి పరీక్షలు, దంత పరీక్షలు, టుడి ఎకో, గైనకాలజిస్ట్ పరీక్షలు నిర్వహించినట్లు వివరించారు. మంచి పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యవంతంగా ఉండేందుకు గడపాలని సూచించారు. పాఠశాల డైరెక్టర్ అనిల్ అయ్యంగార్, ప్రిన్సిపాల్ నీలిమా, కాంగ్రెస్ పార్టీ నేతలు కొత్త గోపాల్‌గౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంటి సర్వేకు ప్రజలు సహకరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న డీసీ రాజు

మల్కాజిగిరి: ఇందిరమ్మ ఇంటి సర్వేకు ప్రజలు సహకరించాలని మల్కాజిగిరి సర్కిల్ డీసీ రాజు కోరారు. సోమవారం సర్వేలో అధికారులు, సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. డీసీ మాట్లాడుతూ.. గతంలో ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇంటికోసం 42,968 దరఖాస్తులు అందాయన్నారు. సర్కిల్ పరిధిలోని 6 డివిజన్లలో 6 బృందాలను సర్వేకోసం ఏర్పాటు చేశామన్నారు. మొబైల్ యాప్ ద్వారా వివరాలు సేకరించి ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. సర్వే సిబ్బంది వారికి కేటాయించిన దరఖాస్తుదారులను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులను గుర్తించాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్వే నిర్వహించాలని సూచించామన్నారు.

విద్యుత్ కాంతులతో క్రిస్మస్ ట్రీ

70 అడుగుల క్రిస్మస్ ట్రీ ఏర్పాటు



మౌలాలి : ఏఎమ్మార్ ప్లానెట్‌మాల్‌లో 70 అడుగుల క్రిస్మస్ ట్రీని ఏర్పాటు చేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రెవరెండ్ ఎరువ బాలస్వామి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరంలో ఇంత భారీ ఎత్తున క్రిస్మస్ ట్రీని ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ఏఎమ్మార్‌మాల్ ఎండీ రాకేష్ కుమార్, మేనేజింగ్ డైరెక్టర్ చాగంటి ఆనంద్‌కుమార్‌లు మాట్లాడుతూ.. గతేడాది 50 అడుగుల క్రిస్మస్ ట్రీని ఏర్పాటు చేశామని, ఈసారి 70 అడుగుల క్రిస్మస్ ట్రీని ఏర్పాటు చేసి ఏర్పాటు చేసి తమ రికార్డును తామే అధిగమించామన్నారు.

గ్రామస్తులకు ఆరోగ్య చైతన్య కార్యక్రమం




కీసర: మహిళల ఆరోగ్యం కేవలం వారి వ్యక్తిగత శ్రేయస్సుకు మాత్రమే కాదు అది కుటుంబ ఆరోగ్యం, సమాజ అభివృద్ధికి కీలకమైనదని భోగారం హోలీమేరి ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ సిద్దార్థ్‌రెడ్డి, కార్యదర్శి విజయశారద అన్నారు. సోమవారం అంకిరెడ్డిపల్లిలో హోలీమేరి ఇన్స్‌ట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆండ్ సైన్స్ (యూజీసీ అటానమస్) ఆధ్వర్యంలో మహిళల ఆరోగ్యం పై అవగాహన కార్యక్రమం, జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల మరియు కళాశాలల్లో (ఉప్పల్, కుత్బుల్లాపూర్)విద్యార్థులకు, అదేవిధంగా గోధుమకుంట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణీ మహిళలకు ఆరోగ్య సంరక్షణపై నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గర్భిణీ మహిళలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. విద్యార్థినీలకు ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్. ప్రీతిరెడ్డి, ఫార్మసీ ఇంజనీరింగ్ మరియు డిప్లొమా ఫ్యాకల్టీ, ప్రొఫెసర్లు, డాక్టర్లు, బీఫార్మసీ విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

నాలా కబ్జాను అడ్డుకోవాలంటూ నిరసన


సర్వీస్ రోడ్డులో నిరసన తెలుపుతున్న మారుతీనగర్ వాసులు

ఘట్‌కేసర్: బైపాస్ రోడ్డులోని సర్వీస్ రోడ్డులో నాలా కబ్జాకు గురైతుందని ఆరోపిస్తూ శివరెడ్డిగూడ మారుతీనగర్ వాసులు సోమవారం నిరసన చేపట్టారు. వర్షం కురిసిన సమయంలో మారుతీనగర్‌లోని నీరు బయటకు వెళ్లకుండా నిర్మాణాలు చేపట్టారని, కల్వర్టును మూసి వేశారని, అలాగే రోడ్డుపై ప్రహరీ నిర్మించారని, దీంతో కాలనీ ముంపుకు గురైతుందని ఆరోపించారు. సంఘటనా స్థలానికి చేరకున్న నీటి పారుదలశాఖ సిబ్బంది, ఏఈ అందుబాటులో లేకపోవడంతో రెవెన్యూ అధికారులతో కలిసి తిరిగి వస్తామని వెళ్లిపోయారు. ఈ విషయమై ఇరిగేషన్ ఏఈ పరమేశ్‌ను వివరణ కోరగా నాలా కబ్జా చేసిన వారిపై కేసు పెడతామని, కబ్జాను తొలగించాలని మున్సిపల్ కార్యాలయానికి లేఖ రాస్తామన్నారు. నిరసన తెలిపిన వారిలో మల్లారెడ్డి, సంజీవరెడ్డి, రాంరెడ్డి, అంజయ్య, మల్లేష్‌యాదవ్, సత్యనారాయణయాదవ్ ఉన్నారు.

ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డు


ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డు అందుకున్న శ్రీలతను అభినందిస్తున్న కళాశాల సెక్రటరీ

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకుడికి ఉత్తమ ప్రిన్సిపాల్, ఆర్‌అండ్‌డీ అవార్డులు దక్కాయి. ఐఐటీ మద్రాస్ రీసెర్చ్ పార్క్, ఈఎస్ఎన్ పబ్లికేషన్స్ మరియు ఎస్ఈఏ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో ఈ నెల 15న ఐఐటీ మద్రాస్‌లో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో భాగంగా వివిధ దేశాల సభ్యులు అవార్డులు అందుకున్నారు. అందులో భాగంగా సెయింట్ పీటర్స్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలతకు సూపర్ ఉమెన్ విభాగంలో ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డును అందుకోగా.. ఆర్‌అండ్‌డీ డీన్ షేక్ అమ్జన్ ఉత్తమ విద్యావేత్త అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి టీవీ రెడ్డి, యాజమాన్యం వీరిని అభినందించారు.

జాతీయస్థాయి కరాటేలో విద్యార్థుల ప్రతిభ



కుషాయిగూడ: జాతీయస్థాయి కరాటే పోటీల్లో చర్లపల్లి, కుషాయిగూడకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఆదివారం నగరంలోని జీడిమెట్ల, షాపూర్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు విజయం సాధించి పలు పతకాలను సొంతం చేసుకున్నట్లు కరాటే మాస్టార్ బుడిగే రవికుమార్ తెలిపారు. అద్వైత, దివ్యశ్రీ, జోషి, శ్రీనిష్, వరుణి, భువన, సహర్ష్‌రెడ్డి బంగారు పతకాలు, బ్రాహ్మిణి, నిశాంత్, తేజస్, శతాన్వీ, వైభవ్, జోషి, ఎస్వీ కార్తీహ రజత పతకాలు సాధించగా.. ఆరాధ్య, శ్రీహిత, ధృకే ఆత్రేయ, కింషుక్‌సింగ్ క్యాంస పతకాలు సాధించారన్నారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

కలెక్టరేట్‌లో 69 ఫిర్యాదులు




సాక్షి,సిటీబ్యూరో: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజలు, పలు ప్రజా సంఘాలు, పార్టీలు 69 ఫిర్యాదులతో కూడిన వినతి పత్రాలను జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి అందజేశారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలపై కలెక్టరేట్ ప్రజావాణిలో నెలల తరబడి ఫిర్యాదులు చేసినా.. పట్టించుకోవటం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నగర శివారు తూముకుంట మున్సిపాలిటీ పరిధిలోని మేడ్చల్ కలెక్టరేట్‌కు వెళ్లాలంటే సరైన బస్సులు, ఆటోల వసతి లేదని.. అయినా ఎన్నో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొని, ఇతర వాహనాలతో వచ్చి ఫిర్యాదు చేసినప్పటికీ పరిష్కారానికి నోచుకోవటం లేదని దుండిగల్‌కు చెందిన ఓ మహిళ ఆవేదన వ్యక్తం చేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, రేషన్ కార్డు, పింఛన్‌తో సహా రెవెన్యూ, ఉపాధి అవకాశాలకు సంబంధించిన దరఖాస్తులు పెట్టుకున్నా.. చెత్త బుట్టలో పడేస్తున్నారని పలువురు ఫిర్యాదులో పేర్కొంటున్నారు.

- జిల్లా పరిశ్రమల శాఖలో రాయితీపై ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, పీఎం విశ్వకర్మ పథకంలో భాగంగా చేతి వృత్తి దారులు ఉపాధి అవకాశాల కోసం దరఖాస్తు చేసుకుని నెలలు గడుస్తున్నా.. పట్టించుకునే వారే లేరని పలువురు సామాజిక వర్గాలకు చెందిన మహిళలు, యువత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజావాణిలో అందించిన దరఖాస్తుల పురోగతిపై ఉన్నతాధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపటంతోపాటు పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను సత్వరమే పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై..

- జిల్లాలో మధ్యాహ్న భోజన కార్మికులకిచ్చే గౌరవ వేతనం, విద్యార్థులకిచ్చే మెనూ చార్జీలు పెండింగ్‌లో ఉన్నాయని, నెలల తరబడి బిల్లులు రాకపోవడంతో అప్పులతో వంట చేసి విద్యార్థులకు పెట్టాల్సి వస్తోందని పాఠశాల మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ)నేత ప్రేమలత ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మేడ్చల్ కలెక్టరేట్ ప్రజావాణిలో మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై యూనియన్ ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ వద్ద వారు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ధర్నాలో యూనియన్ రాష్ట్ర కోశాధికారి ఉన్నికృష్ణన్, యూనియన్ జిల్లా ప్రతినిధులు సువర్ణ, సుజాత, చంద్రకళ, మంగా, మంజుల, వసంత, మధ్యాహ్నం భోజనం కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

భూదేవిహిల్స్ భూముల సర్వే చేయండి

- గాజుల రామారం రెవెన్యూ పరిధిలోని భూదేవి హిల్స్‌లో ప్రభుత్వ, ప్రైవేట్ భూములు మధ్య వివాదం కొనసాగుతోందని, దీన్ని ఆసరా చేసుకున్న కొందరు భూకబ్జాదారులు ప్రభుత్వ భూమిని కాజేసి విక్రయిస్తున్నారని మేడ్చల్ కలెక్టరేట్ ప్రజావాణిలో సీపీఐ స్థానిక నాయకులు ఫిర్యాదు చేశారు. ఒక్కోక ఫ్లాటును రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షలకు అమ్ముతున్నారని సీపీఐ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నాయకుడు హరినాథ్ పేర్కొన్నారు. దీనిపై రెవెన్యూశాఖ వెంటనే సర్వే నిర్వహించి, ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు.

వినతులు తక్షణమే పరిష్కరించాలి: అదనపు కలెక్టర్

ప్రజావాణిలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో జిల్లా 'లా' ఆఫీసర్ చంద్రావతితో కలిసి ఆయన ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ప్రజావాణి అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి, పరిష్కరించాలని అధికారులకు అదనపు కలెక్టర్ సూచించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.